AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

1-8-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో టౌన్ ఏడీఈ చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పులాంగ్ 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినాయక్ నగర్, రానా టవర్, అభ్యాస స్కూల్, ఆకాశ్ అపార్ట్‌మెంట్స్, శివాలయం, కాకతీయ స్కూల్, దేవి టాకీస్, వేణుమాల్, పులాంగ్ రైతు బజార్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని వివరించారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఆపరేషన్ ముస్కాన్‌తో 154 మంది చిన్నారులకు విముక్తి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఆపరేషన్ ముస్కాన్-11లో భాగంగా నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో గత నెల 1 నుంచి 31 వరకు రెస్క్యూ కార్యక్రమం చేపట్టినట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. ఈ మేరకు ఆపరేషన్ ముస్కాన్ వివరాలను శుక్రవారం వెల్లడించారు. ఇందులో భాగంగా 1-18 ఏళ్లలోపు తప్పిపోయిన, అనాథలు, కార్మికులుగా ఉన్న 154 మంది బాలలను గుర్తించినట్లు పేర్కొన్నారు. పిల్లలతో పని చేయించిన వారిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. అలాగే బాల కార్మికుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. తల్లిదండ్రులు లేని పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించినట్లు పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 36 కేసులు నమోదు కాగా, నిజామాబాద్ డివిజన్‌లో 15, ఆర్మూర్‌లో 12, బోధన్‌లో 9 కేసులు చేసినట్లు సీపీ వెల్లడించారు. తప్పిపోయిన పిల్లల వివరాలను దర్పణ్ యాప్‌లో నమోదు చేసి వారి చిరునామా గుర్తించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

## ఇంజినీరింగ్ కళాశాలను సౌత్‌క్యాంపస్‌లో ప్రారంభించాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** నూతనంగా ప్రారంభించే ఇంజినీరింగ్ కళాశాలను తెలంగాణ వర్సిటీ భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో ప్రారంభించాలని పూర్వ జేఏసీ అధ్యక్షుడు పీబీ సత్యం కోరారు. ఈ మేరకు ఆయన సౌత్ క్యాంపస్ వద్ద శుక్రవారం మీడియాతో మాట్లాడారు. వర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరుకు కృషి చేసిన వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్ యాదగిరిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాలను వర్సిటీ సౌత్ క్యాంపస్‌లో ప్రారంభించాలని వీసీకి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు శ్రీనివాస్, హరికృష్ణ, యోగేష్, పవన్, రాజు, పాండు, తదితరులు పాల్గొన్నారు.



## ఏకలవ్య మోడల్ పాఠశాలలో తీజ్ పండుగ

**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో గురువారం బంజారాలు తీజ్ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్ కుమార్ మాట్లాడుతూ.. గిరిజనులు పవిత్రంగా భావించే తీజ్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

జిల్లాలో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. వరినాట్లు దాదాపుగా పూర్తయ్యాయి. మొక్కజొన్న, పత్తి ఇతర పంటలను కూడా రైతులు విత్తారు. ఆయా పంటలకు ప్రస్తుతం ఎరువులు చల్లుతున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఎరువులు పక్కదారి పట్టకుండా ఈ పాస్ యంత్రాల ద్వారా విక్రయాలు చేపట్టాలని ఆదేశించింది. కానీ జిల్లాలో ఎక్కడా ఈ విధానం అమలు కావడం లేదు. – అక్షరటుడే, కామారెడ్డి




# ఎరువుల విక్రయం ఇష్టారాజ్యం..!

- ఈ పాస్‌లో నమోదు చేయని డీలర్లు
- పక్కదారి పడుతున్న ఫర్టిలైజర్స్
- పట్టించుకోని అధికారులు

ఫర్టిలైజర్ షాపుల్లో ఎరువులు, పురుగు మందుల విక్రయ సమయంలో దుకాణాదారులు ఈ పాస్ మిషన్‌లో రైతు ఆధార్ నంబర్ ఎంటర్ చేయాలి. అంతేగాకుండా రైతు తీసుకున్న ఎరువుల బస్తాల వివరాలు సైతం నమోదు చేయాలి. అనంతరం రైతుకు ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేసి ఎరువులు అమ్మాల్సి ఉంటుంది. ఓటీపీ లేకపోతే బయోమెట్రిక్ ద్వారా కూడా ఎరువులు విక్రయించొచ్చు. అయితే చాలా దుకాణాల్లో ఇది అమలు కావడం లేదు. డీలర్లు ఇష్టారీతిన ఎరువులు విక్రయిస్తున్నారు. రైతుల నుంచి వివరాలు తీసుకోకుండానే ఎరువుల బస్తాలు అమ్ముతున్నారు.


### తీరిగ్గా నమోదు..

రైతుల వివరాలు తీసుకోకుండా ఎరువుల బస్తాలు అమ్ముతున్న డీలర్లు తర్వాత తీరిగ్గా ఈ పాస్ యంత్రాల్లో నమోదు చేస్తున్నారు. తమకు తెలిసిన రైతుల వద్ద ఆధార్ నంబర్ తీసుకొని వారే ఎక్కువ బస్తాలు కొన్నట్లు నమోదు చేస్తున్నారు. ఒకటి, రెండు బస్తాలు కొనుగోలు చేసినా.. 20, 30 బస్తాలు కొన్నట్లు నమోదు చేస్తున్నారు. అలాగే కొందరు డీలర్లు ఎరువులను పక్కదారి పట్టించి కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

### విచారణ జరిపితే బట్టబయలు

జిల్లాలో ఫర్టిలైజర్ షాపులలో జరుగుతున్న ఈ పాస్ మిషన్ మోసంపై వ్యవసాయ అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరతున్నారు. ఈ పాస్ మిషన్‌లో నమోదైన రైతులను విచారణ చేస్తే ఆ రైతుకు ఉన్న భూమి ఎంత, తీసుకున్న ఎరువుల బస్తాలు ఎన్ని అనేది వివరాలు బయటపడే అవకాశాలు ఉన్నాయి. కొందరు రైతుల పేరిట భారీగా బస్తాలు తీసుకున్నట్లు నమోదు చేస్తున్న వ్యాపారులు ఎరువులను పక్కదారి పట్టిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలోని పలు ప్రాంతాల్లో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఎరువుల విక్రయాలపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

### చర్యలు తీసుకుంటాం



రైతులకు కావాల్సిన ఎరువులను ఈ పాస్ మిషన్ ద్వారానే విక్రయించాలి. అలా కాకుండా నేరుగా విక్రయాలు జరిపితే సదరు దుకాణ యజమానిపై చర్యలు తీసుకుంటాం. ఈ పాస్ మిషన్ విధానంపై తనిఖీలు చేపడుతున్నాం. దుకాణాల్లో ఉన్న స్టాక్, ఈ పాస్ మిషన్‌లో నమోదైన వివరాలకు తేడాలు వచ్చినట్లు కొన్ని దుకాణాల్లో గుర్తించాం. కామారెడ్డిలో రెండు, బాన్సువాడలో ఒకటి, పెద్ద కొడప్‌గల్‌లో రెండు దుకాణాలకు మెమోలు కూడా జారీ చేశాం.

– మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

## రేపు ఆర్మూర్‌లో మీనాక్షి నటరాజన్ పాదయాత్ర



**అక్షరటుడే, ఆర్మూర్:** కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ చేపట్టిన జనహిత పాదయాత్ర శనివారం ఆర్మూర్‌కు చేరుకోనుంది. నియోజకవర్గంలోని ఆలూరు మండల కేంద్రం నుంచి ఈ పాదయాత్ర ప్రారంభమై గగ్గుపల్లి, ఇస్సాపల్లి గ్రామాల మీదుగా ఆర్మూర్ పట్టణానికి చేరుకుంటుంది. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగనుంది. ఈ పాదయాత్రలో ప్రజల సమస్యలపై వినతులను ఆమె స్వీకరించనున్నారు. పాదయాత్ర అనంతరం పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలోని సీ కన్వెన్షన్ హాల్‌లో మీనాక్షి నటరాజన్ బస చేయనున్నారు. ఆదివారం ఉదయం పట్టణంలో పలు కాలనీల్లో జరిగే శ్రమదానంలో ఆమె పాల్గొననున్నారు. ఆ తర్వాత ఆర్మూర్ పట్టణ శివారులోని యమునా ఫంక్షన్ హాల్‌లో జరిగే ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె పాల్గొంటారు. ఆర్మూర్‌లో జరిగే పాదయాత్రకు కాంగ్రెస్ ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, కార్పొరేషన్ల ఛైర్మన్లు ఈరవత్రి అనిల్, అన్వేష్ రెడ్డి, ఆర్మూర్, బాల్కొండ నియోజవర్గ ఇన్‌ఛార్జీలు వినయ్ రెడ్డి, సునీల్ రెడ్డితో పాటు పార్టీ ముఖ్య నేతలు నాయకులు పాల్గొననున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్నా..



**అక్షరటుడే, లింగంపేట:** తాను ఎమ్మెల్యేను కాదని, ప్రజా సేవకుడిని అని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. లింగంపేట మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ముందుగా కార్యకర్తలు గజమాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనతో కేక్ కట్ చేయించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని, రూ.కోట్లలో నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. అభివృద్ధిపై ఎక్కడైనా చర్చకు సిద్ధమన్నారు. నియోజకవర్గానికి రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయించానని, 22వ ప్యాకేజీకి నిధులు మంజూరు చేసి త్వరలోనే రిజర్వాయర్ పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, ఏఎంసీ ఛైర్మన్ రజిత వెంకట్రాంరెడ్డి, వైస్‌చైర్మన్ జొన్నల రాజు, పీసీసీ మైనార్టీ కార్యదర్శి రఫీయొద్దీన్, ఏలేటి సంతోష్ రెడ్డి, మోహిద్, గోకుల్ సాయిరాం, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాయిని అశోక్, పీర్ సింగ్, నాయకులు పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**అక్షరటుడే, ఇందూరు:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి దరఖాస్తుల వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. నవీపేట తహశీల్దార్ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ఆశించిన రీతిలో దరఖాస్తుల పరిష్కారం జరగడం లేదన్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పదేపదే చెబుతున్నా జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. వేగవంతంగా పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం సీహెచ్‌సీని పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడారు. ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలను పెంచాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వ్యాక్సినేషన్, గర్భిణులకు క్రమం తప్పకుండా పరీక్షలు నూరు శాతం జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. అలాగే నవీపేట, దర్యాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు ఉండాలని, పరిశుభ్రతను పాటించాలని ఆదేశించారు. దర్యాపూర్ పాఠశాల ఆవరణలో శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేయించాలని, ప్రహరీ, టాయిలెట్ మరమ్మతుల కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా ప్రతిపాదనలు సమర్పించాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ వెంకటరమణ, ఏవో నవీన్, వెటర్నరీ డాక్టర్ నరేందర్ తదితరులున్నారు.



నవీపేట సీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

## మహిళా బ్లూ కోల్ట్ విధులు ప్రారంభం..



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో మహిళా బ్లూ కోల్ట్ విధులు ప్రారంభించినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. బ్లూ కోల్ట్ విధులను శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లూ కోల్ట్ విధులు నిర్వర్తించే మహిళా పోలీసులు స్వీయ రక్షణ పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించి వాహనాన్ని జాగ్రత్తగా నడుపుతూ నేర నియంత్రణకు, 100 కాల్స్‌కు తక్షణం స్పందించాలన్నారు. మహిళా పోలీసులతో కూడిన బ్లూ కోల్ట్ విధులను కామారెడ్డి, దేవునిపల్లి, భిక్కనూరు, బాన్సువాడ, ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్లలో అమలు చేస్తున్నామన్నారు. వారి విధులను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించినట్లు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్న తరుణంలో ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. తొలుత కామారెడ్డి జిల్లాలోని ఐదు పోలీస్ స్టేషన్లలో అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, ఏఎస్పీ చైతన్య రెడ్డి, కామారెడ్డి, సదాశివనగర్ ఇన్ స్పెక్టర్లు నవీన్, కృష్ణ, సంతోష్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుబాస్ రాములు, ఎండీఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి దీక్ష చేపట్టారు. అంతకుముందు సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు ఆరు నెలలుగా బిల్లులు రావడం లేదని, దీంతో అప్పు చేసి విద్యార్థులకు భోజనం అందిస్తున్నారన్నారు. జిల్లాకు రావాల్సిన రూ.6 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, గుడ్లు, వంట గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. అలాగే, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వసతి కల్పించాలని, యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేలు వేతనం అందించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సోఫి యా, భాషా మియా, బాలరాజు, సంగీత, సరళ, స్వరూప పాల్గొన్నారు.


అక్షర టుడే Web News E-Paper

విలేకరులు కావలెను

అనతి కాలంలోనే మిలియన్ల మంది పాఠకులను సొంతం చేసుకుని.. డిజిటల్ మీడియాలో దూసుకెళ్తున్న అక్షరటుడేలో పనిచేసేందుకు విలేకరులు కావలెను. తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి, సామాజిక స్పృహతో స్పందించే ఉత్సాహం ఉండి.. అనుభవజ్ఞులైన వారికి మొదటి ప్రాధాన్యం ఉంటుంది. ఆర్మూర్, బాల్కొండ, నందిపేట, కామారెడ్డి, వర్ని, భీమ్గల్, జుక్కల్, మద్నూర్‌లకు విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు 9010337369 నంబరును సంప్రదించగలరు

WWW.AKSHARATODAY.IN

## లింగంపేట ఏపీఎం శ్రీనివాస్ బదిలీ



**అక్షరటుడే, లింగంపేట:** లింగంపేట ఏపీఎం శ్రీనివాస్ బదిలీ అయ్యారు. పదేళ్లపాటు మండలంలో పనిచేసిన ఆయన అందరి మన్ననలు పొందారు. ఆయన ప్రస్తుతం సదాశివనగర్ ఏపీఎంగా బదిలీపై వెళ్లారు. లింగంపేటకు నిజామాబాద్ నుంచి వినోద్ ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

## విద్య, ఉద్యోగాల్లో రోస్టర్ విధానం రద్దు చేయాలి



**అక్షరటుడే, కోటగిరి:** మాల కులస్థులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించారని.. అయితే రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలని మాల సంఘం డివిజన్ అధ్యక్షుడు మిర్జాపూర్ సాయన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వర్గీకరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా, ఉద్యోగ రంగాల్లో సమాన రిజర్వేషన్ కల్పించి మాల కులస్థులకు న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వానికి విన్నవించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు దండు భూమేష్, డివిజన్ కార్యవర్గ సభ్యులు పుప్పాల సైదయ్య, రాములు, మండల మాల సంఘం ఉపాధ్యక్షులు గంగారం, ఖాలే సాయిలు, కార్యవర్గ సభ్యులు గంగాధర్, గంగారం, లక్ష్మణ్, మారుతి, మొగలప్ప, ఆవుల గంగారం, కిషన్, విఠల్, సాయిలు పాల్గొన్నారు.

## చోరీ అయిన సెల్‌ఫోన్ల రికవరీ



**అక్షరటుడే, భీమ్‌గల్:** కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల చోరీకి గురైన రెండు మొబైల్ ఫోన్లను కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్ రెడ్డి శుక్రవారం బాధితులకు అందజేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ల ఆచూకీ పట్టుకున్నామని వివరించారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సెల్‌ఫోన్ రికవరీలో ప్రతిభచూపిన కానిస్టేబుల్ వసుధను అభినందించారు.

## తల్లిపాల వారోత్సవాలపై అవగాహన



**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని తిర్మన్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్ మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు ఆర్నెళ్లవరకు తల్లిపాలే ఇవ్వాలని ఆయన బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లిపాలు శిశువుకు ప్రకృతి ఇచ్చిన వరమన్నారు. వారిలో రోగనిరోధక శక్తి పెంచుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వనజ, ఆరోగ్య కార్యకర్త శారద పాల్గొన్నారు.

# సింగితంకు మరమ్మతులు కరువు




- గతేడాది వరదలకు కొట్టుకుపోయిన రిటెయినింగ్ వాల్
- తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వదిలేసిన అధికారులు
- నిధులు మంజూరు చేయని ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు

**మహమ్మద్ నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్‌ను పట్టించుకునే వారు కరువయ్యారు. ఏడాది క్రితం వరదలకు జలాశయం రిటెయిన్ వాల్ కొట్టుకుపోయింది. అప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన అధికారులు నీరు వృథా కాకుండా ఆపారు. పూర్తిస్థాయి మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. నిధులు లేకపోవడంతో మరమ్మతులు చేపట్టలేదు. ప్రస్తుతం వరద భారీగా వస్తే ప్రాజెక్ట్ పరిస్థితి ఏంటని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.**

**- అక్షరటుడే, నిజాంసాగర్**

గతేడాది కురిసిన భారీ వర్షాలకు సింగితం రిజర్వాయర్‌కు వరద పోటెత్తింది. ఎగువ నుంచి వచ్చిన వరదలతో సింగితం రిజర్వాయర్ ఆలుగు దూకింది. అయితే బుంగల



కారణంగా రీటెయినింగ్ వాల్ పటుత్వాన్ని కోల్పోయి కొట్టుకుపోయింది. దీంతో నీరు వృథాగా పోయింది. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.8 లక్షలు మంజూరు అయ్యాయి. నీటి పారుదలశాఖ అధికారులు ఇసుక బస్తాలను అడ్డు వేసి నీటి వృథాను అడ్డుకున్నారు. అయితే శాశ్వత మరమ్మతుల కోసం రూ. 1.8 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. దీంతో మరమ్మతులు చేపట్టలేదు.

### భారీ వరద వస్తే ఎలా..

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో రిజర్వాయర్‌లోకి వరద నీరు వచ్చి చేరింది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 416.55 మీటర్లు కాగా.. ప్రస్తుతం 415.3 మీటర్లకు చేరింది. అయితే ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద వస్తే తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన రిటెయిన్ వాల్ కొట్టుకుపోయే అవకాశం ఉంది. ఇసుక బస్తాలు కొట్టుకుపోయి నీరంతా వృథాగా పోతుందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. రిజర్వాయర్ కింద నర్వ, మహమ్మద్ నగర్, గున్కుల్ గ్రామాల పరిధిలో 456 ఎకరాల్లో రైతులు వరినాట్లు వేశారు. ఒకవేళ రిటెయినింగ్ వాల్ వద్ద వేసిన ఇసుక బస్తాలు కొట్టుకుపోతే ఈ పంటలు గట్టెక్కడం కష్టమేనని రైతులు పేర్కొంటున్నారు.

### నిధులు విడుదల చేయాలి



గతేడాది కొట్టుకుపోయిన రిటెయినింగ్ వాల్‌కు మరమ్మతులు చేపట్టకపోవడంతో అలుగు పరిస్థితి అధ్వానంగా ఉంది. భారీ వానలు పడితే అడ్డుగా వేసిన ఇసుక బస్తాలు కొట్టుకుపోతాయి. అలా అయితే ఆయకట్టుకు నీరందదు. నిధులు విడుదల చేసి మరమ్మతులు చేపట్టాలి.

– సిరిగిరి గంగారాం, రైతు, నర్వ

### పనులు చేపట్టాలి



గతేడాది వానాకాలంలో కురిసిన వర్షాలతో రిటెయినింగ్ వాల్ కొట్టుకుపోయింది. ఏడాది కావస్తున్నా ఇప్పటిదాకా సిమెంట్ పనులు చేయలేదు. వానలు కొడుతుండడంతో రిజర్వాయర్ నిండుతోంది. వరదలు వస్తే అడ్డుగా వేసిన ఇసుక బస్తాలు కొట్టుకుపోవడం ఖాయం. వెంటనే అధికారులు స్పందించి పనులు చేపట్టాలి.

– గోరుగంటి బాలరాజ్, రైతు నర్వ

## పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.8,300 కోట్లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూడేళ్లకు సంబంధించి రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని దీంతో విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు చెల్లించలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. బకాయిలు విడుదల చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ (ఎస్) జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, టీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు భాస్కర్, సాయిబాబా, శివకుమార్, ఫాజిల్, అబ్దుల్, హకీమ్, మేఘనాథ్, రవీందర్ గౌడ్, మహేష్, జీవన్, గణేష్, శ్రీను, వేణుగౌడ్ పాల్గొన్నారు.

## గాంధారిలో ఆర్డీవో పర్యటన

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని పలు గ్రామాల్లో ఆర్డీవో పార్థసింహారెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా గండిపేట తండాలో ఇందిరమ్మ ఇళ్లు పరిశీలించారు. అలాగే గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హేమ్లానాయక్ తండా, మదుగు తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో అటవీ అధికారుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హిమచందన, పంచాయతీ కార్యదర్శులు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు పనిచేయాలి



**అక్షరటుడే, ఇందల్వాయి:** ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు పనిచేయాలని ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్ రికార్డ్, రైటర్ రూమ్‌ను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న దృష్ట్యా పోలీసులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఏసీపీ సూచించారు ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో టోల్ ప్లాజా ఉన్నందున రోజూ విస్తృతంగా తనిఖీలు చేయాలన్నారు.

## ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తాం



**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** తెలంగాణ విశ్వవిద్యాలయాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని కాంగ్రెస్ నాయకులు, వర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పంచరెడ్డి చరణ్ అన్నారు. శుక్రవారం వర్సిటీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంజినీరింగ్ కళాశాల మంజూరుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, జిల్లా ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీవీయూవీ కార్యనిర్వహక అధ్యక్షుడు లాల్‌సింగ్, గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు జైత్‌రామ్, టీఎస్ఎఫ్ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, ఎన్ఎస్‌యుఐ నగర అధ్యక్షుడు అష్రఫ్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేందర్, మీరాన్ అలీ, అజయ్, సుభాష్ పాల్గొన్నారు.

## బీజేపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



**అక్షరటుడే, ఇందూరు:** అర్బన్ నియోజకవర్గ బీజేపీ కార్యకర్త బషీర్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఆర్థికసాయం మంజూరు చేయించారు. కార్యకర్తలకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ నాయకులు గంట్యాల వెంకటేష్, అభిషేక్, సురేష్ బషీర్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు.

## డిగ్రీ కాలేజీలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు ప్రవేశపెట్టాలి



**అక్షరటుడే కామారెడ్డి:** కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు ప్రవేశపెట్టాలని విద్యార్థి సేన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్ మాట్లాడుతూ.. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు ప్రవేశపెట్టడం ఎంతో అవసరమన్నారు. దూర ప్రాంతాల పేద, మధ్యతరగతి కుటుంబ విద్యార్థులు అధిక ఖర్చుల కారణంగా ఈ కోర్సులు చదవలేకపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సేన నాయకులు ప్రద్యుమ్న, గోపాల్, అంజి, వంశీ, రవళి, ప్రవళిక, స్వరూప పాల్గొన్నారు.

## ఆటో ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** ఆటో ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నగరంలోని తిలక్ గార్డెన్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ పట్టణానికి చెందిన అశోక్(40) తిలక్‌గార్డెన్ వద్ద రోడ్డు దాటుతుండగా.. బస్టాండ్ వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు క్షతగాత్రుడిని హుటాహుటిన '108'లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## స్వచ్ఛమైన కల్లు అందించాలి



**అక్షరటుడే, కోటగిరి :** ప్రజలకు స్వచ్ఛమైన కల్లు అందించాలని ఎక్సైజ్ సీఐ భాస్కర్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మండలకేంద్రంలోని ఈతవనంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ ఆదేశాల మేరకు కోటగిరి సహకార సంఘం ఆధ్వర్యంలో 500 ఈత మొక్కలు నాటినట్లు తెలిపారు. గీత కార్మికులు ఈత వనాన్ని అభివృద్ధి చేసుకుని, ప్రజలకు స్వచ్ఛమైన కల్లు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఏపీవో గంగారాం, తెలంగాణ రాష్ట్ర గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్‌గౌడ్, కోటగిరి టీసీఎస్ అధ్యక్షుడు శంకర్ గౌడ్, గౌడ సంఘం నాయకులు శ్రీధర్ గౌడ్, సాయిబాబా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఏ శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కృష్ణ గౌడ్, అర్జున్ గౌడ్, నాగ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్ట్

**అక్షరటుడే, నిజాంసాగర్:** మండలంలోని నాగల్‌గావ్ శివారులో పేకాటస్థావరంపై పోలీసులు గురువారం రాత్రి దాడిచేశారు. బిచ్కుంద సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో బిచ్కుంద ఎస్సై మోహన్ రెడ్డి, పెద్దకొడప్‌గల్ ఎస్సై అరుణ్ కుమార్ తమ సిబ్బందితో దాడి నిర్వహించారు. తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.10,700 నగదుతో పాటు 9 ఫోన్లు, 8 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## బీజేపీ ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** తెయూ ప్రాంగణంలో బీజేపీ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేష్‌రెడ్డి చిత్రపటాలకు శుక్రవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని బీజేపీ ఎమ్మెల్యేలు శాసనసభ వేదికగా ఎన్నోసార్లు డిమాండ్ చేశారన్నారు. వారి ఒత్తిడి మూలంగానే తెయూలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేశారని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యాదాల నరేష్, కార్తీక్, విజయ్ కృష్ణ, బీజేవైఎం మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

